క్లుప్తంగా

డ్రెయినేజీలు శుభ్రం



డ్రెయినేజీ శుభ్రం చేస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: మండల కేంద్రం కూడేరులోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రధాన రోడ్డు పక్కన, బస్టాండుకు వెళ్లే రోడ్డు పక్కన డ్రెయినేజీలను బుధవారం శుభ్రం చేశారు. ఇదివరకు ఈ ప్రాంతాల్లో మురుగు రోడ్డుపై పారుతుండేది. స్థానికులు, పాదచారులు ఇబ్బందులు పడుతుండటంతో ''రోడ్డుపై పారుతున్న మురుగు నీరు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రభావతమ్మ బుధవారం డ్రెయినేజీలు శుభ్రం చేయించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..శెట్టూరు మండలం కనుకూరు గ్రామానికి చెందిన శ్రీరాములు వ్యక్తిగత పనిమీద బైక్‌పై కళ్యాణదుర్గం వచ్చాడు. పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద అనంతపురానికి చెందిన బొలెరో వాహనం బైక్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం



గోనేహాళ్‌లో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: అతిసారపై అప్రమత్తంగా వ్యవహరించాని బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లేశ్వరి, గీతాభార్గవి, కుమారరాజా సూచించారు. మండలంలోని ఉద్దేహాళ్, గోనేహాళ్ గ్రామాల్లో బుధవారం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి గ్రూప్ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ డయేరియాను నిర్లక్ష్యంగా చేస్తే ప్రమాదకరంగా మారుతుందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా డయేరియాను పారదోలాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఆరోగ్య కార్యకర్త గోవర్ధన, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సచివాలయ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా మైలారప్ప

గుమ్మఘట్ట: సచివాలయ ఇంజినీర్ల అసోసియేషన్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మైలారప్పను ఎన్నికయ్యారు. బుధవారం అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన్ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండలంలోని కలుగోడు సచివాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా మైలారప్ప పనిచేస్తున్నారు. తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావం, చిత్తశుద్ధితో నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

లీజుకు ఆర్టీసీ స్థలం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న 2.47 ఎకరాల ఖాళీ స్థలం, ఆర్టీసీ గ్యారేజ్ వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని లీజుకు ఇవ్వనున్నట్లు డీఎం రామచంద్ర తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారస్తులు www.aprrcap.లో వెబ్ సైట్‌లో టెండర్ అప్లికేషన్ ను ఈనెల 16లోపు డౌన్‌లోడ్ చేసుకుని ఈడీ(కడప) కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం: మొక్కలు నాటి వాటిని జాగ్రత్తగా సంరక్షించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలోని స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు విద్యా కిట్లను అందజేశారు. ప్రతి తరగతిలో ఉత్తమ కనబర్చిన ముగ్గురికి తనవంతుగా ప్రోత్సాహకాలను అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాగా పాఠశాలలో విద్యార్థులకు భోజన గది అసౌకర్యంగా ఉందని, చెట్ల కింద భోజనం చేసే పరిస్థితి ఉందని ప్రధానోపాధ్యాయులు గంధం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఉన్న షెడ్డును కొంచెం పెద్దదిగా ఏర్పాటు చేయాలని, బాలురుకు మూత్రశాలలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

సర్వర్ సతాయింపు!

- కళ్యాణదుర్గం మండలం నారాయణపురానికి చెందిన ఓ విద్యార్థిని ఇటీవల ఈఏపీసెట్ క్వాలిఫై అయింది. ఇంజనీరింగ్ కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో బుధవారం నెట్ సెంటర్‌ను ఆశ్రయించింది. అయితే ఆన్‌లైన్ దరఖాస్తు చేయడానికి కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని నిర్వాహకులు చెప్పడంతో మీ సేవా కేంద్రానికి వెళ్లింది. అక్కడ నిర్వాహకులు గ్రామ సచివాలయానికి వెళ్లాలని సూచించడంతో మరీ నారాయణపురంకు వెళ్లింది. రెండు చోట్ల సర్వర్ సమస్య ఉందని చెప్పడంతో తీవ్ర ఆందోళనకు గురైంది. కనీసం తనకు పాత ధ్రువీకరణ పత్రాలను తీసుకుని రెన్యూవల్ చేసి ఇవ్వాలని కోరినా మీ సేవ నిర్వాహకులు ససేమీరా అనడంతో ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకోలేక కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఎదురుచూస్తోంది.

- జారీ కాని కుల ధ్రువీకరణ పత్రాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



కళ్యాణదుర్గం: సర్వర్ పని చేయకపోవడంతో విద్యార్థులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాల జారీ ఆలస్యమవుతోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది, ఇంటర్ తర్వాత వివిధ ఉన్నత విద్యా కోర్సులలో విద్యనభ్యసించేందుకు వెళ్లే విద్యార్థులకు కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాల సమస్య ఏర్పడింది. గత కొన్ని రోజులుగా విద్యార్థులు ఆయా తహసీల్దార్, మీసేవా, గ్రామ సచివాయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆన్‌లైన్‌లో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలతో ప్రచురితమైన ధ్రువీకరణ పత్రాలు ఉండటంతో వాటిని ప్రస్తుత ప్రభుత్వం నిలుపుదల చేసింది. అయితే వాటి స్థానంలో రాజముద్ర ఉన్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి సర్వర్ సమస్య తలెత్తింది.

మీ సేవా, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు

కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాల కోసం రోజుల తరబడి విద్యార్థులు, తల్లిదండ్రులు నిరీక్షిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి సర్వర్ సమస్య ఉండటంతో వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత విద్యా కోర్సులైన ఎంసెట్, డిగ్రీ, ఇంటర్, బీటెక్ లాంటి వాటిలో చేరేందుకు ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి చేయడంతో ఆందోళన చెందుతున్నారు.

గతంలో నేరుగా వలంటీర్లతో పంపిణీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యా సంవత్సరం ప్రారంభంలో ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లో విద్యార్థులు నేరుగా ఆయా పరిధిలోని వలంటీర్లతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు చేసుకునే వెసలుబాటు ఉండేది. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తక్షణమే ధ్రువీకరణ పత్రం చేతికందేది. వలంటీర్లు నేరుగా విద్యార్థుల ఇంటికి చేరవేసేవారు. ప్రస్తుతం వలంటర్ వ్యవస్థను ప్రభుత్వం దూరం పెట్టడంతో ధ్రువీకరణ పత్రాల మంజూరు ప్రహసనంగా మారింది.

మిరపలో తెగుళ్లు నివారించుకోండి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్‌ఖాన్

ఉరవకొండ: మిరప పంటకు సోకే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. బుధవారం స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో డిజిటల్ గ్రీన్ తరపున మిరప పంటకు సోకే తెగుళ్లు, మార్కెటింగ్ అవకాశాలపై ఉరవకొండ డివిజన్ ఉద్యానవన శాఖ అధ్వర్యంలో అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన అధికారితో పాటు ఉరవకొండ వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకులు పద్మజ, ఉద్యాన అధికారి నెట్టికంటయ్య, డిజిటల్ గ్రీన్ ప్రతినిధి యశోద హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ ద్వారా మిరప పంటలో వచ్చే అన్ని రకాల సమస్యలకు రైతులకు ఫోన్ ద్వారా మెసేజ్ పంపుతామన్నారు. చాట్‌బాట్ ద్వారా అక్కడికక్కడే పంటకు సోకిన తెగుళ్ల నివారణకు పరిష్కారం లభిస్తుందన్నారు. ముఖ్యంగా మిరప రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు గురించి ఆర్‌బీకె సిబ్బంది పూర్తి స్థాయిలో వివరించాలన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మానాయక్

కణేకల్లు: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ హెచ్చరించారు. కణేకల్లులో బుధవారం ఫర్టిలైజర్‌షాపు యజమానులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏడీఏ ఫర్టిలైజర్‌షాపు యజమానుల నుద్దేశించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన వివిధ రకాల పంట విత్తనాలు, ఎరువులు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. మందుల విక్రయానికి తప్పని సరిగా ప్రిన్సిపుల్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. లైసెన్స్‌లు, ఓ ఫామ్, ఇతరాత్ర ధ్రువీకరణపత్రాలు సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుమతి లేని మందులను విక్రయిస్తే చర్యలు తీసుకోవల్సి వస్తోందన్నారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతిదానికి బిల్లులు తప్పక ఇవ్వాలని ఆదేశించారు.

ఫిర్యాదులు రాకుండా చూసుకోండి



బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ కనకరాజు

కూడేరు: కార్డుదారుల నుంచి ఫిర్యాలు రాకుండా బియ్యం, ఇతర సరకులను సక్రమంగా పంపిణీ చేయాలని సీఎస్‌డీటీ కనకరాజు ఆదేశించారు. బుధవారం ఆయన కూడేరులో రేషన్ షాపు-1ను తనిఖీ చేశారు. పంపిణీని వేగవంతం చేయాలని డీలర్‌ను సూచించారు. తూకాల్లో తేడాలు లేకుండా బియ్యం పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఎమ్మార్సీ ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు, గర్భిణులకు సరఫరా అయిన కందిబేడలు, బియ్యం, ఇతర సరకులను పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్ తనిఖీ చేశారు. సరుకులు పక్కదారి పడితే చర్యలుంటాయని అంగన్‌వాడీ సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి



అతిసార వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ అనికేత్

ఉరవకొండ: అతిసార ప్రబలకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కొకుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనికేత్ సూచించారు. బుధవారం మండల బూదగవి జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అతిసారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారితో పాటు హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ మాట్లాడుతూ మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు పలుచటి ద్రవ విరేచనాలైట్లయితే దానిని అతిసార వ్యాధిగా నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. అతిసార బ్యాక్టీరియా, వైరస్ ఇతర సూక్ష్మ జీవుల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, రోజుకు రెండుసార్లు కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు ప్రసాద్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్ఎం షబానా బేగం పాల్గొన్నారు.

మొక్కలు నాటితేనే భావితరాలకు మనుగడ



మొక్క నాటుతున్న తహసీల్దార్ రామాంజినమ్మ

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడితేనే భావితరాలకు మనుగడ ఉంటుందని తహసీల్దార్ రామాంజినమ్మ, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని కళ్యాణదుర్గం - బళ్లారి అంతరాష్ట్ర రహదారి పక్కన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి బాధ్యత తీసుకున్నప్పుడే మొక్కలకు రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వీరన్న, పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఏపీఓ రమేష్, ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, పయ్యావుల అనీల్, లాలుస్వామి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బ చర్మవ్యాధి టీకాలు వేయించండి



బెళుగుప్పలో ఆవులకు టీకాలు వేస్తున్న అధికారులు

బెళుగుప్ప: పశువులకు అతివేగంగా వ్యాప్తి చెందే బొబ్బ చర్మవ్యాధి నివారణకు టీకాలు తప్పకుండా వేయించాలని బెళుగుప్ప పశు వైద్యాధికారి రమేష్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గ్రామాల్లో పశువులకు బొబ్బ చర్మవ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బెళుగుప్పలో 228, బెళుగుప్ప తండాలో 96, గంగవరంలో 376 చొప్పున మొత్తం 700 పశువులకు టీకాలు వేశామన్నారు. అన్ని గ్రామాల్లోనూ టీకాలు వేసే కార్యక్రమాలను చేపడతామని పశు వైద్యాధికారి పేర్కొన్నారు.

చీనీ మొక్కల నరికి వేత

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండ గ్రామానికి చెందిన రైతు చాకలి సుబ్బరాయుడు సాగు చేసిన చీనీ మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. తన మూడెకరాల పొలంలో రెండేళ్ల వయసున్న చీనీ మొక్కలను రైతు నాటి సంరక్షిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి దాదాపు 20 మొక్కలను దుండగులు నరికి వేశారు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించండి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

కూడేరు: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని మండల విద్యాధికారి-1 చంద్రశేఖర్ సూచించారు. బుధవారం కూడేరు ఎమ్మార్సీలో ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల నిర్వాహణ పక్కాగా ఉండాలన్నారు. ఇప్పటి నుంచే పదవ తరగతి విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా బోధన చేసి, వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సాంకేతికతను ఉపాధ్యాయులు అందిపుచ్చుకుని పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన చేసేలా చూడాలని తెలియజేశారు. రికార్డుల నిర్వాహణ పక్కాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సాయి కృష్ణ, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

- రైల్వే స్టేషన్‌లో పెరిగిన సెల్‌ఫోన్ చోరీలు
- ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని పోలీసుల సూచన



తాడిపత్రి రూరల్: తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో దొంగల భయం అధికమవుతోంది. రాత్రి అయితే చాలు సెల్‌ఫోన్ దొంగలు ప్రత్యక్షమవుతున్నారు. దొంగలు కాపు కాచి ఏమరుపాటుగా ఉన్న ప్రయాణికుల నుంచి విలువైన సెల్‌ఫోన్లు తస్కరిస్తున్నారు. సెల్‌ఫోన్ చోరీకి గురైందని గమనించేలోపు దొంగలు పరారవుతున్నారు. వేలాది రూపాయల సెల్‌ఫోన్‌తోపాటు అందులో విలువైన సమాచారం కూడా పోగొట్టుకుంటూ ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. సెల్‌ఫోన్ల దొంగతనంపై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. దొంగల నుంచి రికవరీ చేసిన తరువాత ఇస్తామంటూ బాధితుల చిరునామా తీసుకుని పంపిస్తున్నారు.

రాత్రయితే చాలు..

ఈ మధ్యకాలంలో రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగలు అధికమవుతున్నారు. రాత్రి సమయంలో ఎక్కువగా రైళ్ల రాకపోకలు ఉంటున్నాయి. రాత్రి ఏడు గంటల నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకూ రైళ్లు వస్తూ పోతుంటాయి. హైదరాబాద్, తిరుపతి, చెన్నై, విజయవాడ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ప్రయాణికులు వెళుతుంటారు. రైలు దిగిన తర్వాత అనంతపురంతోపాటు పరిసర మండలాలకు చెందిన ప్రయాణికులు అర్ధరాత్రి వేళ స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సులు, ఆటోల సౌకర్యం లేకపోవడంతో రైల్వేస్టేషన్‌లోనే కాలాయాపన చేస్తూ ఉదయం వెళ్తేంటారు. కొందరు అర్ధరాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేస్తున్నారు. వీరందరూ మొదటి, రెండో ప్లాట్‌ఫారాల్లో వేచి ఉంటున్నారు. మరికొందరు ప్లాట్‌ఫారాలపైన నిద్రపోతున్నారు. సెల్‌ఫోన్‌లకు చార్జింగ్ తక్కువగా ఉన్నవారు వెయిటింగ్ హాల్‌లో చార్జింగ్ పెట్టుకుంటున్నారు. ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకుని దొంగలు సెల్‌ఫోన్లను తస్కరిస్తున్నారు.

సూటూ బూట్‌తో మోసం

వారిని చూస్తే దొంగలు అనిపించరు. సూట్, బూట్ వేసుకుని దర్జాగా కనిపిస్తుంటారు. కాలేజీ విద్యార్థుల మాదిరి వీపున బ్యాగులు వేసుకొని ఉంటారు. మరికొందరు పెద్దమనిషి తరహాలో అనుమానం రాకుండా జాగ్రత్త పడుతుంటారు. ఇలాంటి వారందరూ విలువైన సెల్‌ఫోన్ ఉన్న వారిని ఎంపిక చేసుకుని మాటలు కలుపుతున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. నమ్మకం కలిగేలా మాటలు కలిపి బుట్టలో వేసుకుంటున్నారు. వారు ఉన్నారన్న భరోసాతో ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులు కునుకు తీస్తారు. ఇదే అదనుగా నిద్రలోకి జారుకున్న వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ తస్కరించి అక్కడి నుంచి పరారవుతున్నారు. మెలకువ వచ్చి చూస్తే పక్కన మనిషి ఉండడు.. జేబులో సెల్‌ఫోన్ ఉండదు. లబోదిబోమంటూ పోలీసుల వద్దకు వెళ్లి సెల్‌ఫోన్ దొంగతనం గురించి ఫిర్యాదు చేస్తున్నారు. వెయిటింగ్ హాల్‌లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకుంటున్న ప్రయాణికుల పరిస్థితి ఇంచు మించు ఇదే.

దొంగలను గుర్తించలేకపోతున్న రైల్వే పోలీసులు

టిప్‌టాప్‌గా తయారవుతూ ప్రయాణీకుల మాదిరిగా కనిపిస్తున్న దొంగలను రైల్వే పోలీసులు పసిగట్టలేకపోతున్నారు. అంతేకాకుండా వారు ఏదో ఒక ఊరుకు టికెట్ తీసుకుంటుంటారు. అనుమానం వచ్చి ఎక్కడికి వెళుతున్నారని పోలీసులు అడిగినా తీసుకున్న టికెట్ చూపిస్తున్నారు. దీంతో సెల్‌ఫోన్ దొంగలను పట్టుకోవడం పోలీసులకు కష్టంగా మారుతోంది. ప్రయాణికులు జాగ్రత్తగా ఉంటే సెల్‌ఫోన్ దొంగతనాలను అరికట్టడానికి వీలవుతుందని పోలీసులు సూచిస్తున్నారు.

ప్రొటెక్షన్ వాచర్లను నియమించాలని వినతి

కుందుర్పి: జంబుగుంపల అడవికి ప్రొటెక్షన్ వాచర్లను నియమించాలని ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ గంగాధర అటవీశాఖ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం కళ్యాణదుర్గం అటవీశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఒక బీట్ ఆఫీసర్ మాత్రమే పని చేస్తుండగా బీట్ ఆఫీసర్ సైతం సెలవులో వెళ్లడంతో కొందరు కలపను నరికి కర్ణాటకకు తరలిస్తున్నారన్నారు. పక్కన కర్ణాటకలో 2 వేల ఎకరాల్లో ఉన్న అడవికి నలుగురు ప్రొటెక్షన్ వాచర్లు పని చేస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా జిల్లా అటవీశాఖ స్పందించి ప్రొటెక్షన్ వాచర్లను నియమించాలని వారు కోరారు.

96 ప్యాకెట్ల మద్యం పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 96 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మద్యాన్ని తరలిస్తున్న రాముడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

హెల్త్ యూనిట్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జేఈ కావ్య

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జరుగుతున్న పబ్లిక్ బ్లాక్ హెల్త్ యూనిట్ పనులను బుధవారం ఆర్‌అండ్‌బీ జేఈ కావ్య పరిశీలించారు. జేఈ మాట్లాడుతూ రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన పబ్లిక్ బ్లాక్ హెల్త్ యూనిట్ పనులు పూర్తయినట్లు చెప్పారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఉమా



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఉమా

కళ్యాణదుర్గం రూరల్: తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు మర్యాదపూర్వకంగా కలిసికారు. ఈసందర్భంగా మాజీ సీఎం నియోజకవర్గంలోని పార్టీ స్థితిగతులపై ఉమాను అడిగి తెలుసుకున్నారు.

అక్రమ బియ్యం వ్యాపారుల బైండోవర్

బొమ్మనహాళ్: మండలం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారాన్ని నిర్వహించే వారిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కర్ణాటకలోని బొమ్మదరపల్లి చెందిన సురేష్‌తో పాటు మరో మహిళ అక్రమ రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపణలు రావడంతో వారిని బుధవారం బొమ్మనహాల్ తహసీల్దార్ రామాంజినమ్మ ముందు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. మరోసారి బియ్యంతో పట్టుబడితే 6 నెలలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా ఉంటుందని హెచ్చరించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

కళ్యాణదుర్గం రూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కోరారు. ఈమేరకు బుధవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ జీవో 17ను వెంటనే మార్పు చేయాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఆశా వర్కర్లకు కనీసం వేతన రూ. 20 వేలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి పాతక్క, సెక్టార్ లీడర్లు తిప్పేరమ్మ, రాధ, విజయనిర్మల, ద్రాక్షాయణి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ



విద్యార్థినులతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ అల్లాబకాష్

రాయదుర్గం రూరల్: పట్టణంలోని దాసప్పరోడ్డులో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీఓ అల్లాబకాష్ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఎంఈఓ - 2 వెంకటరమేష్ తో కలిసి బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి మౌలిక వసతుల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం వండుతున్నారా? టెక్ట్స్ పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇచ్చారా? లేదా ? అని ఆరా తీసినట్లు చెప్పారు. అలాగే హాజరు పట్టిక , ఇతర రికార్డులను తనిఖీ చేశామన్నారు. ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థినులకు సూచించారు.

ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ తొలగింపు

ఉరవకొండ: రాయలసీమ విద్యార్థి యువజన సంఘం (ఆర్ఎస్‌వైఎఫ్) జిల్లా కన్వీనర్ పోస్టు నుంచి చిరంజీవిని తొలగిస్తూ రాష్ట్ర కమిటీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిరంజీవి విద్యార్థి సంఘానికి వ్యతిరేకంగా నడుచుకోవడమే కాకుండా వ్యక్తిగత అవసరాలకు సంఘం పేరు వాడుకున్నందున తొలగిస్తున్నట్లు అందులో పేర్కొంది. ఇక మీదట అతనికి ఆర్గనైజేషన్‌తో ఎటువంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు.

